# పులిరాజు

## — గంటి రమాదేవి

"బిరార్‌కు సెంట్రల్ ప్రావిన్స్‌కు రాజధానిగా ఉండేది నాగపూర్. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మధ్య ప్రదేశ్‌కు రాజధానిగా ఉండేది. సరే ... భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు కాగానే నాగపూర్ తన ప్రాముఖ్యతను కోల్పోయి మహారాష్ట్రలో ఒక భాగమయిపోయింది." ఇండియా భౌగోళిక పరిస్థితులు చూపే పటం చూపుతూ అన్నాడు పున్నాగ. పున్నాగ నిక్ నేమ్.

"విక్రమ్! జీపులో అన్నీ సర్దావా? 12 బోరు రైఫిల్సు, కార్ట్రిడ్జ్ రెండు పెట్టె. బాస్కెట్లో టీ, బిస్కట్లు ... ఇది మర్చిపోకు."

సీలు పీకని శివాజ రీగల్ బాటిల్‌ను చూపిస్తూ అన్నాడు. విక్రమ్ కొండజాతి వాడు. అడవులన్నీ బాగా తెలిసిన వాడు.

నాలుగు రోజుల క్రితం బాలాఘాట్ నుంచి పున్నాగ ఫారెస్ట్ ఆఫీసుకు చేరుకున్నప్పుడు అతను తాగుతున్నాడు బ్లాక్ నైట్. నాకు ఫారెన్ మద్యం గురించి అంతగా తెలీదు. వీటి ఖరీదు వంద లలో ఉంటుందని మాత్రం తెలుసు.

పున్నాగ అసలు పేరు పులి నాగరాజు. ఎనిమిది ఏళ్ళ క్రితం కాలేజీలో అతడు పెద్ద బాడ్మింటన్ చాంపియన్. తూర్పు గోదావరి ప్రాంతం వాడు. విశాఖలో తానున్న నాలుగేళ్ళలో పులి నాగరాజు పేరు తెలియని వారు లేరు. బాడ్మింటన్‌లో ఎదిరించి ఆటగెలిగేవాళ్ళు లేరు. అతని ప్రత్యేకత ఆట ఒక్కటే కాదు. స్పోర్ట్సుమేన్‌కి ఉండవలసిన సహనం, క్రమశిక్షణ పుష్కలంగా ఉన్నాయి. గెలవాలన్న కసి, క్రౌర్యం, ఏ పద్ధతినైనా విజయం పొందాలనే దీక్ష. ఇవి ఆటలో కనిపించేవి. ఎంతటి ఆటగాడికయినా ఒక్కోసారి ఓటమి తప్పదు. ఓడిపోయే క్షణాల్లో చూడాలి పున్నాగ విజృంభణ. పగబట్టిన పాములా బుసగొడుతూ పులిలా. అరుస్తూ కోర్టులో అతని చేసే విన్యాసం చూసి కొందరు ఆటగాళ్ళు బెదిరిపోయే వాళ్ళు. ఆరు అడుగులకు రెండంగుళాల తక్కువగా, బలిష్టంగా, మెరిసే పాములాంటి కళ్ళతో, బాటు ఎడమచేతితో పట్టుకుని ఉన్నప్పుడు ప్రత్యర్థిలో భయం వల్ల సగం చావ చచ్చేవాడు. అయినా ఒక్కోసారి ఎంతటి వాడికయినా ఓటమి తప్పదు ... పున్నాగ గెలుపు పొందే వరకు నిద్రపోడు. అయితే ఆ రోజుల్లో అతను పొందిన ఓటమి, అందునా నా వల్ల జరిగినది మర్చిపోయాడా? ... ఏమో!

జీపు బయలుదేరింది. వెనుక విక్రమ్ కూర్చుని ఉన్నాడు. రెండు 12 బోర్ రైఫిళ్ళు ఉన్నాయి.

"ఇక్కడ పగలు వేడి ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి ఎక్కువ. ఈ కనా నేషనల్ పార్కు విస్తీర్ణం దాదాపు తొమ్మిది వందల చదరపు కిలోమీటర్లు. కొంతభాగం మాండ్లీ జిల్లాలోను, కొంత బాలాఘాట్‌లోను ఉంది. జన సంచారం ఇక్కడ చాలా తక్కువ. అక్కడ అక్కడా కొండజాతి (బైగాలు) వాళ్ళ గ్రామాలు ఉన్నాయి. ఇక్కడినుంచి నాగపూరు దాదాపు రెండు వందల కిలోమీటర్లు. మాకు పట్టణ జీవితం మీద మోజు కలిగినప్పుడు నాగపూరో, లేదా హైదరాబాదో పోతూ ఉంటాం. అక్టోబరు, నవంబరు మాసాలలో రేసెస్‌లో నే నక్కడే ఉంటా." పున్నాగ అన్నాడు.

ఎర్రటి దుమ్ము లేపుకుంటూ జీపు బయలుదేరింది. ముందు చిన్న చిన్న తుప్పలతో చిట్టడవిలా ఉన్న ప్రాంతం రాను రాను దట్టంగా తయారయింది. వెదురు పొదలు, బ్రహ్మాండమైన సాల వృక్షాలు. సాత్ పూరా పర్వత శ్రేణులు అవి.

"బాలాఘాట్, మాండ్లీ జిల్లాలు పూర్వంనుంచి పులులకు ప్రసిద్ధి. జనవాసాలకు దూరంగా ఈ కొండ కోనల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయి పులులు. ఎప్పుడైనా రుడ్యార్డ్ కిప్లింగ్ పుస్తకాలు చదివావా? ముఖ్యంగా జంగిల్ బుక్." అడిగాడు పున్నాగ.

ఈ ఎనిమిదేళ్ళలోనూ పున్నాగ శారీరకంగా ఏమీ మారలేదు. కాని కొంచెం మద్యపానం ఎక్కువైనట్టు అనిపించింది. విశాఖలో కూడా చదువుకునేటప్పుడు అలవాటు ఉండేదట.

"రుడ్యార్డ్ కిప్లింగ్ తన 'జంగిల్ బుక్' కు ఈ అడవులనే ఆధారంగా తీసుకున్నాడు. పూర్వపు ఇంగ్లీషు దొరలు ఇక్కడకు వచ్చి పులులను వేటాడేవారు. పులి బలమన్నా, ఆ క్రౌర్యమన్నా, తెలివితేటలన్నా దొరలకు ఎంతో అబ్బురపాటు. ఒక పులిని చంపడమంటే ఇప్పుడు రూబిక్ క్యూబ్‌ని సాధించడమంత థ్రిల్ ఉండేది వాళ్ళకు, ఏదో మిస్టరీని సాధించి, జయించినట్టు. పులి చాలా జంటిల్. అయితే ప్రేమలో పరాజయం పొందితే అది పడే అవమానం, మానసిక క్షోభ, భంగపాటు దాదాపు మనిషిలో లాగే ఉంటుంది. అటువంటి పులులు మనిషికి ప్రమాదం. సాధారణంగా మనిషి దగ్గరికే రాని పులులు అప్పుడు మనిషిని వెన్నాడి చంపేస్తాయి." పున్నాగ చెప్పడం ఆపి నా కేసి చూశాడు. లోతుగా ఉన్న అతని నల్లటి కళ్ళలో భావాలను అర్థం చేసుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది.

'పులి చాలా జంటిల్. అయితే ప్రేమలో పరాజయం పొందితే .. ఈ మాటలు నా చెవిలో గింగురు మన్నాయి.

● ● ● ●


అనుపమ వర్గీస్, మిస్ తవియుత్, నిర్మలారాణి వీళ్ళు ముగ్గురే మా క్లాసులో ఆడపిల్లలు. వర్గీస్ కేరళ దేశస్థురాలు. మిస్ తవియుత్ పాండిచ్చేరి నుంచి వచ్చింది. నిర్మలా రాణి గోదావరి జిల్లా అమ్మాయి. ఆడపిల్లలకు చదువు చెప్పించడం అవసరం అని గ్రహించి తల్లిదండ్రులు అప్పుడప్పుడే ఆడపిల్లలను కాలేజీలో చేరుస్తున్న రోజులవి.

మా రూము ముందున్న తోటలో ఒక రోజు కరుణశ్రీ పాపరాజు 'సీతా పరిత్యాగం' చదువుకుంటున్నాను. ఒంటరిగా ఉన్నానేమో, హుషారుగా పద్యం గట్టిగానే పాడుతున్నాను.

"ఆకర్ణాయత నేత్రమై, మణిమయోద్యత్కుండల
ద్వంద్వశోభాకీర్ణాంచిత గండమై, సురదనంబై,
సుందరంబై, క్రుమస్మిత చంద్రికా విలసితంబై
యొప్పు శ్రీరామ మోహనాకారయుంబున జూచు
భాగ్యమిక లేదో! సుమిత్రాత్మజా."

పాడగా పాడగా నా పద్యం నాకే మృదువుగా, మధురంగా అనిపించింది. కళ్ళు మూసుకుని పాడుకుంటున్న నాకు కళ్ళు తెరిచేసరికి ఒక ముసలాయన కనిపించాడు. కళ్ళలో నీళ్ళు (అలవాటు లేకపోవడాన) తుడుచుకుని సిగ్గుతో చూశాను.

"ఉత్తర రామాయణం ఎంత చక్కగా రాశాడు పాపరాజు. రాగయుక్తంగా బాగా పాడావు. . .కాలేజీలల్లో చదువుకుంటున్నావా? పేరేమిటి?" ముసలాయన




అడిగాడు.

"బి. ఎస్‌సి. చదువుతున్నానండీ... పేరు కృష్ణంరాజు."

"సీతా పరిత్యాగమేనా...ఇంకా ఏమైనా..."

"కలహాంకురము...ఘోష యాత్ర..."

"హరిశ్చంద్రోపాఖ్యానం చదివావా?"

"చదివానండీ...నాకు చాలా ఇష్టమైన ద్విపద కావ్యం. ముఖ్యంగా కలలోనైనా, నవ్వులాకైనా మనసునైన, మాటవరుసకైన అనే భావంతో, హరిశ్చంద్రుని సత్యవ్రతాన్ని వర్ణించే ఘట్టం నాకు చాలా ఇష్టం."

"కావ్యాలు చదివి ఆనందించడమే కాదు. ఆచరణలో కూడా ఉండాలి" అన్నాడు ఆ ముసలాయన.

తర్వాత తెలిసింది ఆయన నిర్మలారాణి తాతగారు.

ఒకరోజు పున్నాగ నా గదికి వచ్చాడు.

“కృష్ణంరాజూ! నువ్వు ఒక సాయం చేయాలిరా. . .” ప్రాధేయపడుతూ అన్నాడు పున్నాగ. ఏమిటన్నట్టు చూశాను.

“నిర్మలా రాణి. . .ఫైనలియర్. . .ఆ అమ్మాయిని. . .వాళ్ళుబాగా ఆస్తిపరులు. నరసాపురంలోను, పనేటిపల్లిలోను ఎన్నో కొబ్బరి తోటలు, పాడీ పంటా అవీ ఉన్నాయి. ఈ మధ్య ప్రొద్దుటూరు దగ్గర ఎర్రగుంటలో కొన్ని మెట్ట భూములు ఖరీదు చేశారట. . .ఆ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నానురా. . .మేమూ రాజులమే. వాళ్ళూ రాజులే. . .అయితే వాళ్ళ తాతగారు చాలా పాతకాలపు మనిషి. మేము ఆస్తితో వాళ్ళకు సరితూగలేము.”

“నేనేం చేయాలి?”

“ఆయన నీకు బాగా తెలుసుగా. . .నా గురించి బాగా చెప్పాలి. ఈయన ‘వూ’ అంటే జరిగి పోయినట్టే. అదీకాక నిర్మలారాణిని నేను గాఢంగా ప్రేమించాను. మా పెళ్ళయిపోతే ఆమె ఆస్తి. . . అంతా నాకే.”

పున్నాగ ఉద్దేశం నాకు చూచాయగా అర్థమైంది. వాడి ప్రేమరెప్ప ఆస్తి. . .అదే అడిగాను.

“పంచభూతాల సాక్షిగా ఆమెను నేను మనసారా ప్రేమించాను” అన్నాడు.

నేను నమ్మాను. ఆ తర్వాత పున్నాగ చెప్పిన అభూతకల్పనలు మూటగట్టుకుని పెళ్ళి బేరానికి బయలుదేరాను.

•  •  •  •

రోద చేసుకుంటూ జీపు పోతూ ఉంది. కొంత దారి చాలా ఇరుకుగా ఉంది.

“ఒరే కృష్ణంరాజు! నువ్వు తెలుగు బాగా చదువుకున్నావు కదా. . .నదికి, నదానికి తేడా చెప్పరా?” పున్నాగ అడిగాడు.

దూరంగా హోరుమని శబ్దం చేస్తూ పారు తూంది నది.

“పడమర నుండి తూర్పుకు ప్రవహించేది నది. తూర్పు నుండి పడమరకు ప్రవహించేది నదము.” చెప్పాను.

“ఈ లోయలో పారుతున్నది, బ్రహ్మాండమైన నది మహానది. . .విచిత్రంగా లేదూ?” పున్నాగ అడిగాడు.

“విచిత్రం ఏముంది?”

“తూర్పు నుంచి పడమరకు ప్రవహించే నదాన్ని నది అనడం అందునా మహానది అనడం. మహానదము అనాలేమో.” నవ్వుతూ అన్నాడు.


•  •  •  •

నేను తాతగారి ఇంటికి వెళ్ళేసరికి నిర్మలారాణి వరండాలో కూర్చుని ఉంది. ఇంతవరకు పరీక్షగా చూడలేదు నిర్మలారాణిని. పున్నాగ ఆమెని వివాహం చేసుకోదలచినట్టు చెప్పగానే నా చూపులో పరిశీలన చోటు చేసుకుంది. నిర్మలారాణి ఆస్తిపరురాలే కాదు. అందగత్తె కూడా.

ఏదో రాసుకుంటున్నదల్లా, నా అడుగుల చప్పుడు విని తలఎత్తింది.

“రాజుగారా? ఆలా వచ్చారేమిటి!” అందానికి తగ్గ గొంతు. కళ్ళలో రాజసం. పున్నాగకు ఏదో విధంగా ఈమె నచ్చి చేస్తే. . .చెయ్యాలి అనుకున్నాను. ఇంతలో నిర్మలారాణి తాతగారు బయటకు వచ్చారు. చేతిలో ఏదో పుస్తకం. . . చరిత్రాత్మక పద్య గ్రంథం. . .పేరు పాణిగ్రహణం కొడాలి వెంకట సుబ్బరావు, కామరాజుగడ్డ శివయోగా నందరావుగారి హంపీ క్షేత్రములో భాగం. కృష్ణ దేవరాయలు గజపతి కుమార్తెను పెళ్ళాడే సందర్భం. సరే. .వచ్చిన పని అదే కాబట్టి సందర్భం సరి పోయింది అనుకున్నాను. పున్నాగ మనసు ఆయనకు వివరించాను.

“పూర్వం స్వయంవరం ఉండేది. ఆ సంప్రదాయం పోయి, పెద్దలు కుదిర్చే పెళ్ళిళ్ళు జరిగేవి. ఇప్పుడు మళ్ళీ పాత పద్ధతులకు వస్తున్నామన్న మాట” అన్నా రాయన.




“కుల ప్రసక్తి లేదండి...” అని పున్నాగ గురించి ఉన్నవి కొంచెం ఎక్కువగా, లేనివి తక్కువగా గడగడా వాగేశాను.

“శ్రీరామచంద్రుడిని, సత్యహరిశ్చంద్రుడిని ఇంతకాలము ప్రజలు ఎందుకు గుర్తు పెట్టు కున్నారంటావ్? వాళ్ళలో ఉన్న సద్గుణాలు అందుకు కారణం. పులి నాగరాజు గురించి అమ్మాయి నాకు చెప్పింది. డబ్బు ఉన్నవాడికి దయ, క్షమ, దానగుణం ఉండాలి. లేకపోతే ధనమదంతో తన కున్న సహజ గుణాలు, క్రూరత్వం, కసి, పగ లోకానికి కంటకంగా తయారవుతాయి. పులి నాగరాజు గురించి ఈ విషయంలో నువ్వేమయినా చెప్ప గలవా? ఒక స్నేహితుడికి సహాయం చేయాలని అనుకున్నావు. అయితే ఈ నీ మానవి స్నేహితుడికి ద్రోహం చేయ.కూడదని నీకు తట్టలేదా?

“కలలోనైనా, నవ్వితాలకైనా, మనసునైనా, మాట వరుసకైనా కల్లలాడని సత్యహరిశ్చంద్రుని కావ్యం నీ కిష్టంకదూ” మెల్లిగా నవ్వా రాయన.

తల వంచుకు వచ్చేశాను. అయితే తర్వాత జరగబోయేదానికి ఇది నాంది అని అప్పుడు నాకు తెలీదు.

జీపు కొండదిగి ఒక మైదాన ప్రదేశం చేరు కుంది.

“ఈ కనా పార్కులో పులులూ, చిరుతలతో బాటు, ఇతర సాధువన్య ప్రాణి కూడా ఉంది.” పున్నాగ అన్నాడు.

జీపు నెమ్మదిగా పోనిస్తున్నాడు చప్పుడు చేయకుండా. ఎదురుగా మైదానం. అక్కడక్కడా పచ్చని మైదానంలో చుక్కల్లా జింకలు, దుప్పులు.

“చూడు...రాజా...అవి మచ్చల జింకలు. సిమెంటు రంగు శరీరంపై పసుపు పచ్చని చుక్కలు. తడి నేలల్లో తిరిగే జింకలు. .మొరిగే జింకలు. ఆ ప్రక్కగా చూడు నాలుగు కొమ్ము లున్న జింకలు. ఆ చెట్లపైన కొండముచ్చులు (కొండెంగలు). ఈ కొండముచ్చులకూ, జింకలకూ స్నేహం. అవి చెట్టుమీదనుండి తింటూ తింటూ కొంత ఆహారాన్ని జింకలకు వేస్తాయి. పులులు వస్తూ ఉంటే, మహా గొడవ పడిపోతాయి. కొమ్మలు పట్టుకు ఎగురుతూ “హూవ్...హూవ్..” అని అరుస్తూ ఒక్కొక్కప్పుడు...అంటే పులి మరీ దగ్గరకు వచ్చినప్పుడు క్కా క్కా ఖ్కొ ఖ్కొ అని అరుస్తూ జింకలకు హెచ్చరిక చేస్తాయి.”

వెనక విప్రమూ జోగుతున్నాడు.

“నాగరాజా! అద్భుతమైన అనుభవం ఇది. ఈ వన్య ప్రాణిని వాటి సహజ రీతిలో చూడడం” అన్నాను నేను.

“కృష్ణా...ఇంకా ఇది ఏమీలేదు. మరువురాని అనుభవం ముందు ఉంది. జీవితంలో నువ్వు అది మరిచిపోవని నేను హామీ ఇస్తున్నాను. నే నబద్ధం చెప్పడంలేదు” అన్నాడు పున్నాగ. ‘నేను అబద్ధం చెప్పడంలేదు’ అన్నమాట పత్తి పలుకుతూ.

నిర్మలా రాణి ఇంటినుంచి పున్నాగ పెళ్ళి విషయం మాట్లాడి తిరిగి వచ్చిన తర్వాత అడిగాడు పున్నాగ.

"ఏమైంది?"

"నేను అబద్ధం చెప్పలేకపోయాను. అబద్ధం చెప్పలేను."

అప్పుడు కళ్ళలో చూసిన పైశాచికత్వపు ఛాయలు చేసిన నృత్యాన్నృత్యం నేను ఎప్పుడూ మరిచిపోలేను. పున్నాగ కూడా మరిచిపోలేదు.

నేను మరిచిపోలేని ఆ అనుభవం ఏమిటి? నా మెదడులో ఆ ఆలోచన రాగానే వళ్ళు జల్లుమంది.

• • • •

మధ్యాహ్నం జీపు ఒక చెట్టు క్రింద ఆపాడు. పున్నాగ తెచ్చుకున్న ఫలహారాలు తిని నీళ్ళు త్రాగాం. నర్మదానది నీళ్ళు చల్లగా ఉన్నాయి. నేను స్నానం చేస్తానన్నాను. "మొసళ్ళుంటాయి వద్దు" అన్నాడు పున్నాగ. అయితే నా ప్రాణం గురించి ఏమీ భయంలేదు. నన్ను ఏమైనా చేయదలచుకుంటే మహానదిలో స్నానం చెయ్యమని అనవచ్చుకదా!

ఒరియాలో విక్రమాతో ఏదో మాట్లాడాడు. విక్రమా రైఫిలు, కొన్ని సామాన్లు జీపులో నుంచి తీసి క్రిందపెట్టాడు.

"కృష్ణంరాజా...కొండకి అవలివైపు సాల్ చెట్లు కొడుతున్నట్లు అనుమానంగా ఉంది. ఎంత కాపలా కాసినా ఈ పోచింగ్ (రహస్యంగా జంతువులను చంపడం) అటవీ సంపద లూటీ ఆపలేకపోతున్నాం. నేను సాయంత్రం లోపల వచ్చేస్తాను. నీకు తోడుగా విక్రమా ఉంటాడు. అవసరమైతే రైఫిలు ఉపయోగించు. నీకు రైఫిలు ఉపయోగించడం తెలుసుగా. బై ది బై. నిర్మలా రాణి ఎలా ఉంది? పూరు వెళ్తే అడిగానని చెప్పు" అంటూ నా సమాధానంకోసం చూడకుండా జీపు నడుపుకు వెళ్ళిపోయాడు. నిర్మలా రాణి అని పేరు ఉచ్చరించినప్పుడు ఆ కళ్ళలో, తల ఎగరేయడంలో, గొంతులో హేళన ధ్వనించింది.

ఎటు చూసినా రెండువందల మైళ్ళు తక్కువకాని అడవి ప్రాంతం. భాష తెలియని విక్రమా. ఒక రైఫిలు. అనేక ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. విక్రమా నమ్మదగ్గవాడేనా? అసలు నేను పున్నాగ దగ్గరకు రావడంలో విశేషం గ్రహించాడా? కాలేజి చదువు అయిన తర్వాత నిర్మలా రాణి తాలూకు, మా తండ్రిగారు రామభద్రరాజుగారితో సంప్రదించి నిర్మలా రాణితో నా వివాహం జరిపించడం తెలుసా? నేను రైఫిలు ఉపయోగించగలనని, ఉపయోగించే అవసరం ఉన్న ఉద్యోగంలో ఉన్నట్టు పున్నాగకు ఎలా తెలుసు?


అటవీ సంపద లక్షల రూపాయలు విలువ చేసేవి అక్రమంగా రవాణా అవుతూ ఉండడం, దానిలో కొంతమంది అవినీతిపరులైన అధికారులు చేతులు కలపడం., దాన్ని పరిశీలించి సాక్ష్యాధారాల కోసం ఉద్యోగరీత్యా నేను రావడం పున్నాగకు తెలియదని నేననుకోడం పొరబాటేమో!

హఠాత్తుగా గుర్తుకొచ్చింది పున్నాగ మాటలు.

"పులి చాలా జంటిల్‌మేన్. అయితే ప్రేమలో పరాజయం పొందితే" పులి నాగరాజా తన పథకం విఫలం కావడానికి నేనే కారణమని అనుకుని ఉంటాడు. పున్నాగ ఖరీదైన జీవితం నిర్మలా రాణి ఆస్తిని, ఆరోగ్యాన్ని ఇప్పటికే తినేసి ఉండేది. దైవవశాత్తు తప్పిపోయిన వివాహం తప్పిపోకుండా ఉండి ఉంటే...ఇప్పుడది దేశ సంపదైన అడవులను నాశనం చేస్తోంది. షివాజీ రీగల్' నాగపూరులో పట్టణ జీవితం. హైదరాబాద్‌లో రేసెస్. పున్నాగా! నువ్వు జీవితాన్ని కూడా ఒక గేముగా తీసుకున్నావా?

• • • •

విక్రమా ఏదో చెపుతున్నాడు దూరంగా ఉన్న జింకలకేసి చూపిస్తూ. ఒక రాటికి రాయికట్టి బలంగా విసురుతూ జింకల గుంపులో పడేటట్లు విసిరాడు. మొరుగుతూ, అరుస్తూ జింకలు పరుగెత్తాయి. చిరుతపులిలా పరుగెత్తాడు విక్రమా వాటి వెంట. కనుమరుగయ్యేవరకు చూస్తూ ఉండిపోయాను. పున్నాగ ప్లాను నాకు అర్థమైంది. రైఫిలు ప్రక్కన బెల్టుకు ఉన్న కాట్రిజన్ చూశాను. నేను అనుకున్నదే నిజమైంది. అవి డమ్మీవి!




• • • •

అడవిలో చీకట్లు ముసురుకుంటున్నాయి. సన్నగా నదిమీద నుంచి చల్లటి గాలి వీస్తోంది. పనికిరాని రైఫిలు. ఒక చిన్న మూట. ఇవే నా స్నేహితులు.

కొండముచ్చులు కొమ్మలమీద ఎగురుతున్నాయి. వాటి ప్రవర్తనలో ఏదో ఆందోళన. "కాక్కా...ఖ్కొఖ్కొ" అరుపులు.

చీకటి పడేవేళకు పులులు బయటికి వస్తాయి. పులులను చూడగానే చిన్న చిన్న జంతువులు పారిపోతాయి. ముప్పయి, నలభై అడుగుల ఎత్తు మీద ఉన్న కొండముచ్చులు కూడా ప్రాణ భయంతో ఒక చెట్టుమీద నుండి ఇంకో చెట్టు మీదకు గెంటుతూ ఉంటాయి. నిజానికి అంత ఎత్తు ఏ పులీ ఎగరలేదు. గెంతడంలో కొన్ని క్రిందపడిపోతాయి. వేగంగా కదులుతూ క్రింద పడిన కొండముచ్చులను పంజాతో కొట్టి ఒకే దెబ్బతో చంపేస్తుంది పులి!

పులికి వాసనతో శత్రువును పసిగట్టడం తెలీదు. తన దృష్టితో చూసినది చెవులతో విన్న శబ్దాల ఆధారంగా అది శత్రువును గుర్తిస్తుంది. అడవులలో నివసించే మనుష్యులు నలుగురు ఐదుగురుంటె గట్టిగా మాట్లాడుకుంటూ పోతూవుంటారు. అవసరమున్నా, లేకపోయినా ఒక్కరుంటే ఏదో గట్టిగా పాడుకుంటూనో, దగ్గుకుంటూనే తమ ఉనికిని తెలియబరుస్తారు. పులిదగ్గర ఒకవిధమైన వాసన ఉంటుంది. ఆ వాసనబట్టి దూరంగా వెళ్ళిపోతారు మనుషులు.

జంతువుల ప్రవర్తన గురించి చదివినది గుర్తుకొస్తోంది.

కొండముచ్చుల గోల ఎక్కువైంది. రైఫిలు తీసుకున్నాను. మూట భుజాన వేసుకున్నాను. అప్పుడు చూశాను. ఒకదానివెంట ఒకటిగా రెండు పులులు. పసుపు పచ్చని శరీరంపై నల్లటి చారలు. పొంటికి పైన తెల్లటి చిన్న చిన్న చారలు. ముదుటి భాగంలో ఎగురుతున్న పక్షి రెక్కలా విప్పుకున్న రెండు పెద్ద నల్లటి పొడుగాటి చారలు.

బలమైన ముందు కాళ్ళను కదిలిస్తూ వస్తూ ఉంది ముందుకి. సూదుల్లా ఉన్న దాని మీసాలు అది గుర్రుమన్నప్పుడు కదులుతూనే ఉన్నాయి. నేను స్థాణువులా నిలబడిపోయాను. దాని వెనకాలే ప్రమాణంలో దానికన్న పెద్దపులి. జింకలు, కొండముచ్చులు దూరంగా పారిపోయాయి. నాకు ముప్పయి అడుగుల దూరంలో మూర్తీభవించిన మృత్యుదేవతల్లా, కొండల్లా కదిలిపోతున్న రెండు పులులు. ఈ వెయ్యిమైళ్ళ అడవిలో నాలుగు

వందలు తక్కువకాకుండా పులులు ఉండవచ్చు. గుప్పుమని భరించరాని వాసన గాఢంగా నా ముక్కుకు తగిలింది. పులి నన్ను ఇంకా చూడ లేదు.

ఏడ సమయంలో పులి మామూలుకన్న భయంకరంగా ఉంటుంది. ఆకలి వేసినప్పుడు వేటాడుతుంది పులి. ఆకలి లేనప్పుడు వేటమీద అంత ఇష్టం చూపించదు.

పులులు దూరంగా వెళ్ళిపోయాయి. నాకు పందగజాల దూరంలో ఒక చెట్టు ఉంది. ఆ చెట్టుమీద ఒక కొండముచ్చు నాకేసి చూస్తూ ఊపుతూ, పళ్ళు చూపిస్తూ పులులువేపు చూపిస్తూ ఏదో అరుస్తూంది. నేను మనిషి నయినా పులికి భయపడుతున్నానని, తన సాటి సాధుప్రాణులు జింకలకు హెచ్చరిక చేస్తూ ఉన్నట్లే నాకు చెబుతూ ఉంది. నేను కదలక పోవడంతో ఇంకా ఎక్కువ గొడవ చేస్తోంది నా దృష్టి నాకర్షించడానికి!

అప్పుడు ఆ రెండింటిలో ఒక పులి గాండ్రించింది.

పులి గాండ్రింపు అంత భయంకరంగా ఉంటుందని నేననుకోలేదు. అడవి, కొండలు, నదీలోయ అంతా భయంకరంగా ప్రతిధ్వనించి జీవజాలాన్ని భయభ్రాంతుల్ని చేసింది. దిగ్భ్రమ కలిగించింది. కొన్ని క్షణాలపాటు ఆ భీకరశబ్దం వినిపిస్తూనే ఉంది. నిరాకరింపబడ్డ పులి ఆక్రోశమది. ఈ రాత్రికి ఏ చెట్టుపైనో చేరాలి. ఈ రాత్రి గడిస్తే...రెండువందల మైళ్ళ అడవి పగటిపూట దాటగలనా? ఎటు వెళ్ళాలి? పున్నాగ పులిలాగ నామీద కక్ష తీర్చుకుంటున్నాడు. విశ్వనాథ ఎందుకిలా చేశాడు. కొండజాతివాళ్ళు చాలా నిజాం నమ్ముతుంటారే?

నాకు ఆలోచించుకునే వ్యవధి ఇవ్వలేదు పులి. పందగజాల దూరంలో ఉన్న పులి నన్ను చూడనే చూసింది. భంగపడ్డ పులి మూర్తీభవించిన మృత్యుదేవత! పరుగెత్తాను ప్రాణంకోసం. పున్నాగను పట్టివ్వడానికి బయలుదేరిన నేను! నిర్మలను తలుచుకుంటూ పరుగెత్తాను. నా వెనుకే సుమారు ఎనిమిది అడుగుల పొడవు, నాలుగడుగుల ఎత్తు కలిగిన, నిగనిగ మెరుస్తూన్న కళ్ళతో నన్ను చంపాలని చూస్తూ పులి. నా తర్ఫీదు పని చేసింది. వంద అడుగుల ఎత్తున్న చెట్టు సగం ఎక్కగలిగాను. కాని...కాని...మనిషికన్న బలమైనది పులి. ఎందుకో నా జోలికి ఇంకా రాలేదది. చెట్టు కొమ్మలపైనుంచి చూశాను. పులిచేతిలో కొండముచ్చు. భయంతో బిగుసుకుని క్రిందపడి పులికి ఎర అయిందా? నా గురించి ఆత్మార్పణ చేసిందా? పులి ఈడ్చుకుపోతూన్న కొండముచ్చు శరీరాన్ని జాలిగా చూశాను. పరుగెత్తడంలో రైఫిలు (ఎలాగు ఉపయోగం లేదు) మూట (దానిలో తినడానికి ఏదైనా ఉందేమో ) వదిలేశాను. రెండు కాళ్ళు ఇటొకటి అటొకటి వేసి ఇంకొక పెద్ద కొమ్మను ఆనుకుని కూర్చున్నాను. పూర్తిగా చీకట్లు ఆవరించుకున్నాయి.

*     *     *     *

చలి బాగా ముదిరింది. చెట్టుకున్న చీమలు కుడుతున్నాయి. దూరంగా పర్వతాలు నల్లగా భూతాల్లా నిలబడి ఉన్నాయి. ఏవేవో జంతువుల అరుపులు.

నక్షత్రాల కాంతిలో నల్లగా కదులుతూ పోతోంది ఒక ఆకారం. చిరుత కాదు కదా! ఈ అడవిలో చిరుతలు కూడా ఉన్నాయి. జేబులో గాను సిగరెట్టు లైటరు ఉంది. మంటంటే పులికీ, చిరుతకు, ఎలుగుకీ భయం. కాని సిగరెట్టు లైటరు పదిహేను, ఇరవై నిమిషాలు వెలుగుతుంది. తర్వాత? దగ్గరగా వచ్చింది ఆ ఆకారం. అడవిదున్న! రాత్రప్పుడు ఎందుకు సంచరిస్తోందో! చిన్న ఏడుపులా అడవిపిల్లి కూత వినబడుతోంది. ఏమరుపాటుగా ఉన్న చిన్న జింక పిల్లల్ని చంపుతాయి అవి.


దూరంగా ఏవో నవ్వులు. రాత్రిపూట ఏ గ్రామస్థులైనా వెళుతున్నారా? అవి మనిషి నవ్వులు కాదు. ఏదో జంతువు అరిచినట్లు అడవి కుక్కలు రాత్రి పూట తిరుగుతూ ఉంటాయి. పెద్ద జంతువులు తిని మిగిల్చిన కంకాళాల మాంసం తింటాయి. ఎముకలు విరిచి దానిలో ఉన్న మజ్జను తింటాయి. గుంపులు గుంపులుగా కదులుతూ ఆహారం దొరికినప్పుడు అవి అరిచే అరుపులు క్రూరంగా...కీచుగా...నరాల తోడేసేటట్లు, కర్ణకఠోరంగా నవ్వులు...నవ్వులు.

చలి గడగడలాడిస్తోంది. ఈ రాత్రి గడుస్తుందా? ఏభై అడుగుల ఎత్తుమీద ఉన్న కొమ్మమీదనుండి క్రిందికి చూశాను. గుండె ఒక క్షణం కొట్టుకోడం మానేసింది. మహానది జలప్రవాహం హోరు తప్ప అంతా నిశ్శబ్దం. క్రింద అదే పులి. వెనుక కాళ్ళమీద కూర్చుని మెరిసే కళ్ళతో నాకేసే చూస్తూ ఉంది. గట్టిగా కొమ్మను పట్టుకున్నాను. పులి కదలలేదు. తీక్షణంగా తదేకంగా నన్నే చూస్తూ ఉంది. ఏ క్షణానా నామీదకు దూకుతుందో చెప్పలేను. ఇంక పైకి చెట్టు ఎక్కే వీలులేదు. ఆందోళనతో లేచి నిలబడ్డాను. అదే నేను చేసిన పొరపాటు. మెరుపు వేగంతో కదులుతూ నన్ను తన పంజాతో కొట్టాలని లంఘించి దూకింది పులి. చెట్టంతా కదిలిపోయింది. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని కొమ్మను గట్టిగా పట్టుకున్నాను. మళ్ళీ కొంతసేపటికి మళ్ళీ ఎగిరింది. ఈసారి ఇంకొంచెం కొమ్మకు దగ్గరగా రాగలిగింది. ఇలా నాలుగయిదు సార్లు చెయ్యాలి. అప్పుడు పులి అలసిపోతుంది.

పైకి ఎగబాకడంలో నా చొక్కా పూర్తిగా చిరిగిపోయింది. చెయ్యికి చిన్న చిన్న దెబ్బలవల్ల రక్తం కారుతోంది. క్షణమొక యుగంలా కదులోతోంది. కొంతసేపటికి పులి వెళ్ళిపోయింది విసుగు పుట్టి కాబోలు!

చేతులు పట్లు తప్పుతున్నాయి. ఆకలివేస్తూ ఉంది. ఆ మూటలో నే వదిలేసిన మూటలో ఏమైనా తినడానికి దొరకవచ్చు. చేతులు కాళ్ళు జాడించి నెమ్మదిగా క్రిందికి దిగాను. అప్పుడు చూశాను. ఏభై అడుగుల దూరంలో పొదలో ఏదో కదులుతూ మిల మిల మెరుస్తూన్నాయి. పులి కళ్ళు. విపరీతమైన వేగంతో చార్జీ చేసింది పులి. చకచకా మళ్ళీ చెట్టు ఎక్కాను. పులి ఎగిరింది. కాలికి పంజా దెబ్బ తగిలింది. అయినా క్షేమంగానే పైకి చేరాను. "ది టైగర్ ఈజ్ ది మోస్ట్ కన్నింగ్, ఫెరోషియస్ అండ్ డెడ్లీ ఎనిమల్" ది వైల్డ్ ఎనిమల్స్ ఆఫ్ ఇండియాలో పులులను గురించి వ్రాసిన వాక్యాలు గుర్తుకు వచ్చాయి.

తెల్లవార్లూ పులి నన్ను చూస్తూనే ఉంది. తెల్లవారుతూ ఉండగా లారీ ఇంజను చప్పుడు విని పులి పారిపోయింది.



*     *     *     *

నలుగురు కూలీలు, లారీ డ్రైవరు నా కేకలు విన్నారు. పెద్ద పెద్ద కర్రలున్నాయి వాళ్ళ చేతులలో. నే నున్న చెట్టువద్దకు వచ్చి నన్ను దింపారు.

లారీలో అడవి చెట్టు దుంగలు ఉన్నాయి. అడవిలో చెట్లు కొట్టుకుని లారీమీద రవాణా చేస్తున్నారు. దుంగలపై బలిసిన దుప్పి ఒకదాన్ని కోస్తున్నాడు ఒక కూలి.

మధ్యాహ్నానికి ఏభై మైళ్ళు దాటాం. ఎగుడు, దిగుడు దారి. ఒకచోట లారీ ఆపి, మంటలేసి జింకను కాల్చారు. సారా త్రాగుతూ, మాంసం తింటూ రెండు మూడు గంటలు గడిపారు నాకు కూడా పెట్టారు. ఆవురావురుమని తిన్నాను. వన్యప్రాణిని చంపడం నేరం. ఆ నేరాన్ని అరికట్టడానికి వచ్చాను. ఆ నేరంలో నేనూ పాలు పంచుకున్నాను!

మర్నాటి ఉదయానికి ముక్కి, కాపా బ్లాక్సు దాటి జనవాసాలున్న చోటుకు చేరాను. బాలాఘాట్ వెళ్ళకుండా మాండ్లీకు వెళ్ళాను.

రెండురోజుల తర్వాత రిపోర్టు తయారు చేశాను.

మిస్టర్ పి. ఎన్. రాజు ఎలా తన బాధ్యతను తప్పించుకొని పనిచేసేవాడో, ఎలా చట్టాన్ని ఉల్లంఘించేవాడో అందులో సవిస్తరంగా ఉంది. ఎవిడెన్సు కలెక్టడ్. లారీ డ్రైవరు, నలుగురు కూలీల స్టేటుమెంట్సు దానికి జతపరిచాను. *